
# ఎక్స్పెండబుల్

హార్థిక

పవర్ కట్... వేళాపాళా లేకుండా కరెంట్ వస్తోంది, పోతోంది. రాత్రంతా దోమల రొదకి నిద్రలేదు. పక్కలో పెళ్లాం గురకొకటి. ఛీ ఛీ... విసుక్కున్నాడు సుందర్రావ్.

బయట కీచురాళ్ల చప్పుడు స్పష్టంగా వినబడుతోంది. కోళ్లగూట్లోకి పిల్లి దూరినట్లుంది... కెక్కెక్కె అ0నే కోళ్ల అరుపుల మధ్య నుండి మ్యావ్‌మంటూ పిల్లి బెదురుకేక... రాత్రి గాలి వానకి కోళ్లగూటికడ్డంపెట్టిన చెక్క పడిపోయుంటుంది... గొణుక్కున్నాడు సుందర్రావ్. గాలి వాన మాట మెదడులో మెదలగానే కట్టకింది సపోటాతోట గుర్తుకొచ్చింది. చాలా పండ్లు,



కాయలు కనబడ్డంలేదు... ఖచ్చితంగా ఎవరో ఏరుకుపోతున్నారు...

తన పరిశోధనలో తడిచిన నేలపై కాలి గుర్తులు కన్పడ్డాయి. ఆడవాళ్లవో, పిల్లలివో అ య్యుండాలి. పదిహేను రోజుల క్రితం తాను ఒడిసి పట్టుకున్న శకుంతల గుర్తుకొచ్చింది. నరాలు జివ్వుమన్నాయి. ఒక్కసారిగా ఒళ్లు వేడెక్కింది. దొంగ శకుంతలే అయితే...? ఇక మన సాగలేదు. కర్ర తీసుకొని టార్చిలైటు చేత్తో పట్టుకొని లుంగీ ఎగ్గట్టి అమరావతి కట్టకేసి వడివడిగా బయల్దేరాడు సుందర్రావ్... అతని బుర్రిప్పుడో దెయ్యాల కొంప...

* * *

పురుషోత్తం ప్రతిరోజూ తెల్లవారు ఝామునే కట్టమీద ఉదయపు నడకకై వస్తాడు. ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ నడవడం అతనికి ఆనందం.

అయితే ఈ ఉదయం ప్రకృతి బీభత్సంగా ఉంది. రాత్రి వీచిన గాలికి కట్ట పక్కన చెట్లు వంగిపోయున్నాయి. అల్లంత దూరాన వరద నీరు చేరి కృష్ణమ్మ పొంగి పొర్లుతూ ఉంది. కొన్ని కోతులు కట్టమీద కీచులాడుకుంటున్నాయి. పిల్లకోతులు చెట్లెక్కి వీక్షిస్తూ ఉత్సాహంగా కొమ్మల మీద పల్టీలుకొడ్తూ వినోదిస్తున్నాయి.

పురుషోత్తం కోతుల మధ్యకు వచ్చేసాడు. మనిషి అలికిడికి సాధారణంగా పక్కకు తొలిగే కోతులివ్వాళ అతనిని చుట్టుముట్టాయి. కాఫీ కలర్ ట్రాక్ సూట్ మీద నిలువుగా ఎర్రటి చారలు, పైన ఎర్రటి షర్ట్ ధరించి ఉన్నాడతను. ఓ కోతి ముందుకు పరిగెట్టి కాపుకాసింది, ఇంకొకటి నిశ్శబ్దంగా నిరీక్షిస్తోంది అతని రియాక్షన్ కోసం.

మూడు కోతులు చుట్టుముట్టి భీకరంగా కోరలు బయటపెట్టి అరుస్తూ పైజామా టీషర్ట్ లాగసాగాయి. ఏదో ఆలోచనలో ఉన్న అతను ఈలోకంలోకి వచ్చాడు. అతనికి తెలుసు... భయపడినా, అదిలించినా ఇవాళ తనపని అయిపోయినట్లే! వాటి కళ్లలోకి సూటిగా చూస్తూ తన గుండెదడని, నిలువెల్లా వ్యాపిస్తున్న భయాన్నీ బయటపెట్టకుండా ధైర్యంగా అడుగులు ముందుకేసాడు. కోతులు నాలుగైదడుగుల్ని వెంబడించి, నెమ్మదించాయి.

చుట్టూ చూసాడు. పిల్లకోతులేగానీ పెద్ద కోతులు కన్పించలేదు. మేటింగ్ సీజన్ అయి ఉంటుంది, అసహనంగా ఉన్నాయి వానరాలు. పైగా తన వంటిపై ఎర్ర రంగు... వడివడిగా నడక సాగిస్తున్నాడు.

* * *

తూర్పునుండి పడమరకు తిన్నగా సాగే అమరావతి కట్టకి దక్షిణంగా ఉండవల్లి వైపు దట్టంగా విస్తరించుకొనుంది సుందర్రావ్ నాల్గెకరాల సపోటాతోట. తోట బయట తడినేల మీద ముగ్గురాడవాళ్లు చతికిలబడి ఉన్నారు. వాళ్ల పక్కనే పాతచీరలతో కట్టిన మూడు సపోటా మూటలు...

కర్రుచ్చుకొని వాళ్లచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు సుందర్రావ్. ఇద్దరాడవాళ్లకి ముప్పై దాటిన వయస్సు, మూడో ఆమెది తలనెరసి ముడతలుపడ్డ ముఖం, అరవై దాటిన వయస్సు... జంకూ గొంకూ లేకుండా నిర్వికారంగా కూర్చునుంది. ఒక స్త్రీ భయం భయంగా దిక్కులు చూస్తోంది. ఇంకొకామె లెఖ్ఖ చేయనట్లు పొగరుగా చూస్తోంది. ఆమె అందాన్ని కొరుక్కు తినేటట్లు గుటకలేస్తూ చూస్తున్నాడు సుందర్రావ్. ఆమే శకుంతల... సుందర్రావ్ మనసుపడ్డ ఆడది.

* * *

కట్ట దిగువ పొలం నుండి ఓ కాపు కర్ర విసిరాడు. కట్ట కానుకునున్న పొదల్లోకి రివ్వున దూసుకొచ్చిందది. అర్థంకాక భృకుటి ముడిచాడు కట్టపై నడక సాగిస్తున్న పురుషోత్తం. కర్ర దూసుకెళ్లిన దిక్కుగా చూస్తే... ఓ అడవిపంది పొదలోకి దూరింది. అతని గుండె ఝల్లుమంది... ఏంటీ రోజు? షాక్ మీద షాక్?... రెండు కుక్కలు పొదల బయటే తచ్చట్లాడుతున్నాయి. వాటి కళ్లల్లో భయం. ఒకటి రైతు దగ్గరికి తిరిగెళ్లగా మరొకటి కట్టెక్కి పురుషోత్తాననుసరించింది. పొదల్లో మళ్లీ అలికిడి... బెదిరిన కుక్క ఇంకాస్త ముందుకి పరిగెట్టి, కాలెత్తి ఓ మొక్కకి ఒంటేలు పోసి, కాసేపు తచ్చట్లాడి ముందుకుసాగింది.

"జాగ్రత్త సారూ.... పొదల్లో అడవిపంది దూరింది. దాన్తల్లి... ముట్టితో కెల్కికెల్కి చేమ తోటంతా పాడుచేసింది, దొరికితే కైమానే ఇవ్వాళ..." అరుస్తున్నాడు కాపు.

పురుషోత్తం పెదవులపై చిరునవ్వు "ఎవడి బాధ వాడిది..." సపోటాతోట దగ్గరికి చేరాడు. క్రింద జరుగుతున్న భాగోతాన్ని వీక్షించి పలకరించాడు.

"ఏంది సుందర్‌మామా కథ?"

"ఈ లం...లు రోజూ తోట దులుపుకుపోతున్నారల్లుడూ, ఈరోజీళ్లకి మూడింది..."

"వదిలెయ్ మామా... ఏదో నీ ఆస్తంతా దోచినట్లు కటింగ్..."

"బడిపంతులువికదా... లోకమంతా మంచిగనే కన్పిస్తుంది నీకు. ఏడాది వ్యవసాయం చేస్తే తెలుస్తుంది..."

"పాపం మామా... బీదోళ్లు... వదిలెయ్..."

"ఛస్ పోరా... ఇట్లాంటోళ్లనేంజేసినా పాపం లేదు"

"నువ్వీ జన్మకి బాగుపడవ్" కదిలాడు పురుషోత్తం.

"ఈ శకుంతల నిక్కడొదిలేసి మీ ఇద్దరూ మా ఇంట్లో ఈ మూటలప్పజెప్పిరండి... అప్పుడాలోచిస్తా మీ ముగ్గుర్నేం జెయ్యాలో..." ఆడవాళ్లనుద్దేశించి అన్నాడు సుందర్రావ్. ఏం సమాధానం చెప్పకుండా మొండికేసి కూర్చున్నారు శకుంతల, ముసలమ్మ. మూడో ఆమె మాత్రం "అతను చెప్పినట్లు చేద్దాం పద" అన్నట్లు ముసలమ్మకేసి చూసింది.

* * *

సుందర్రావు భార్యకి గుండె జబ్బు. ఆస్తికి కక్కుర్తిపడి చేసుకున్నాడామెని. ఆపైన ఉండవల్లిలో మామగారింటికి ఇల్లరికం చేరాడు. కట్నంకిందొచ్చిన పదెకరాల పొలంతో పాటు హైదరాబాద్, బెంగుళూర్లలో స్థిరపడ్డ తన బామ్మర్దుల చెరి పదెకరాల పొలం కూడా తానే సాగు చేయిస్తూ రెండు చేతులా సంపాయిస్తున్నాడు. ఇవికాక ఊర్లో హాస్పిటల్ పక్కనే ఒక బ్రాందీ కమ్ దొంగసారాయి దుకాణం కమ్ బార్ ఉంది. మేనల్లుడ్ని చేతికిందేసుకున్నాడు షాపు వ్యవహారాలు చూడటానికి. భార్య జబ్బు మూలంగానైతేనేమి, సంతానం కలగకపోవడం వల్లనేమి, పెళ్లితో వచ్చిపడిన నక్షమంత్రపు సిరి వల్లనైతేనేమి... సుందర్రావ్ మహాభోగిగా తయారయ్యాడు. లేని వ్యసనంలేదు. అన్నింటికీ మించి అమ్మాయిల పిచ్చి... పక్షం క్రితం మొక్కజొన్న తోటలో పనిచెయ్యడానికొచ్చిన కూలీల్లో అందంగా, పొంకంగా ఉన్న శకుంతల అతని కంటబడింది. గుబురుగా ఏపుగా పెరిగి ఉన్న సపోటా తోటలోని పంపుషెడ్డులోకి ఆమెను రప్పించి, ప్రలోభపెట్టానికి ప్రయత్నించాడు. లొంగలేదామె. ఆనక బలవంతం చెయ్యబోతే తన్నరాని చోట తన్ని పరిగెత్తిన శకుంతల కళ్లలోని కసి

అతనిలో కామాగ్నిని మరింత రెచ్చగొట్టింది...

ఇక ఆమె గురించిన పూర్తి సమాచారం సేకరించసాగాడు. ఆమె బలం, బలహీనతలు గ్రహించసాగాడు. శకుంతలకి చిన్న చిన్న దొంగతనాలు చేసే అలవాటుంది. రైతులు చూడకుండా అందినన్ని ఉల్లిపాయలు, ములక్కాడలు, సపోటాలు, జామకాయలు మూటకట్టుకు పోతూంటుంది చీకటివేళ. సమయం కోసం వేచివున్నాడు... "ఇవ్వాళ దొరికినట్లే అనిపిస్తోంది... ఈ ముసల్దాన్ని, బెదురుగొడ్డునీ పంపించేస్తే... ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. కట్టమీద నరసంచారంలేదు... గుబురుతోటలో దీన్నేంచేసినా నరమానవుడెవ్వడూ పసికట్టలేడు... పైగా దొంగతనం చేస్తూ పట్టుబడింది కదా, మొహంలో పశ్చాత్తాపం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఇదే అదను..." తొలిసంధ్యవేళ సుందర్రావులో రాక్షసుడు పూర్తిగా బలం పుంజుకుంటున్నాడు.

శకుంతల చిన్నతనంలో చదువుల సరస్వతి. అనకాపల్లి నిదానందొడ్డిలో నివాసం ఉండేవాళ్లు. తండ్రి కూరగాయల కమీషన్ వ్యాపారం చేసి బాగానే గడించేవాడు. శకుంతల జీవితంలోకి ప్రేమంటూ సత్తిబాబు శనిలా ప్రవేశించకపోతే తను చదువుకున్నంతవరకూ చదివించేవాడు తండ్రి రామయ్య.

శకుంతల కలలుకన్నట్లు స్టీల్‌ప్లాంట్‌లో పెద్ద ఆఫీసరయ్యేది కూడా. అదేపనిగా ఆమె వెంటపడి, బ్రతిమిలాడి, బెదిరించి, రక్తంతో ప్రేమలేఖలు వ్రాసి పెద్ద సినిమానే చూపించాడు ఇంటర్ ఫెయిలయ్యి ఆవారాగా తిరిగే సత్తిబాబు. ఆమె అతని బుట్టలో పడింది. స్కూల్ ఫైనలే ఆమెకు ఫైనలయ్యింది. చదువు చంకనాకిపోగా లక్ష్యం గాల్లోకెగిరిపోయింది.

లేచిపొయ్యెళ్లి సింహాచలంలో స్నేహితుల అండతో పెళ్లి చేసుకున్నారిద్దరూ... కులాలు వేరు కావడంతో రామయ్య ఈ వివాహానికొప్పుకోలేదు. దరిమిలా ఊరొదిలి విజయవాడ దగ్గర్లోని ఉండవల్లొచ్చి పడ్డారు నవదంపతులు. రెండేళ్లపాటు బయట కాలుపెట్టనీయకుండా, తోపుడు బండి మీద పళ్లు, కాయగూరలమ్ముతూ బుద్ధిగానే చూసుకున్నాడు తన భార్యని సత్తిబాబు. కళ్యాణి పుట్టింది. ఇరు వైపుల కుటుంబాలీసరికి చేరువవడంతో ఆ పిల్లతో పాటు ముసలం కూడా పుట్టింది.

సత్తిబాబు తల్లిదండ్రులు కట్నం అడగమని సత్తిబాబుని ఎక్కెయ్యసాగారు. వాళ్ల ప్రోద్బలంతో షాపేదయినా అద్దెకు తీసుకుని స్థిరంగా వ్యాపారం చేస్తానని, డబ్బు తీసుకురమ్మని శకుంతలని పోరసాగాడు సత్తి. మనస్సు కుదురు చేసుకొని రామయ్య కూడా రెండు మూడు దఫాలు డబ్బు సర్దుబాటు చేసాడు.

ప్రేమ మత్తులో పడి చదువుని అలక్ష్యం చేసిన సత్తిబాబు నేర్చుకునే వయస్సులో జీవిత పోరాటానికవసరమైన నేర్పు, పని, పొదుపు, వ్యసనాలకు దూరంగా ఉంచగల నిగ్రహం అలవర్చుకోకపోవడంతో వ్యాపారం దెబ్బతింది. మద్యానికి బానిసయ్యాడు.

విధి మళ్లీ తోపుడుబండికీడ్చగా, బతుకు కేరాఫ్ బస్టాండయ్యింది. కొద్దోగొప్పో సంపాయించడం, పూటుగా తాగి బండిమీదే పడుకోవడం... శకుంతల జీవితం వీధినపడింది. కూతుర్ని బళ్లో వేసి, ఆ పిల్లమీదే ఆశలన్నీ పెట్టుకొని, ఆ పనీ ఈ పనీ చేస్తూ సంసారం నెట్టుకురాసాగింది. ఇటు ఆమె కూడబెట్టింది దోచుకుపోయి తాగుడికి తగలెట్టేవాడు సత్తి. చివరికో రోజు రాత్రి తాగిన మత్తులో ఇంటికొస్తూ లారీకిందపడి చనిపోయాడు. చిమ్మ చీకటిలో దిక్కుతోచకుండా ఉన్న శకుంతల జీవితానికి

మళ్లీ సూర్యోదయమైనట్టైంది. అయితే కష్టా లింకా తీరలేదు.

రైతుబజార్ దెబ్బకి రామయ్య కమీషన్ బిజి నెస్ దెబ్బతింది. కొడుకుల సంపాదన మీద ఆధారపడ్డ అతను కూతురికి తన ఇంట్లో మళ్లీ స్థానం కల్పించలేకపోయాడు. శకుంతల వంట రిదయింది. ఇది జరిగి ఐదేళ్లయింది.

ప్రస్తుతానికొస్తే తల్లి కష్టాన్ని అర్థంచేసుకున్న కళ్యాణి శ్రద్ధగా చదివి టెన్త్ క్లాస్‌లో మండలానికే ఫస్ట్ వచ్చింది. గవర్నమెంట్ కొత్తగా పెట్టిన ట్రిపుల్ ఐటీలో సీటు గ్యారెంటీ. కానీ డబ్బు? శకుంతలకి తాను కోల్పోయిన బంగారు భవిష్య త్తు నిరంతరం కళ్లముందు మెదుల్తోంది. తనలా తన కూతురి జీవితం కాకూడదు. అదే ధ్యేయం గా ముప్పొద్దులా చాకిరీచేస్తూ ప్రతిపైసా పొదు పు చేసుకొస్తోంది.

ఈ మధ్య సుందర్రావు కళ్లు ఈమె మీద పడ్డాయి... తనకు లొంగిపోతే కావల్సినంత డబ్బు సర్దుబాటు చేస్తానంటున్నాడు. కళ్యాణిని తన సొంత కూతుర్లా చూసుకుంటానని, చదివి నంతా చదివిస్తానని ప్రలోభపెడ్తున్నాడు.

ఆమె పలు విధాలుగా ఆలోచిస్తోంది. "చది వేది ఇటువంటి డబ్బుతో అని తెలిస్తే కూతురి లేతమనస్సు విరిగిపోదా?... వద్దు. కలోగంజో తాగి బ్రతికినా గౌరవముంటుంది గానీ... ఒక డికి ముండగా ఉండే బ్రతుకేం బ్రతుకు?...

ఏదో ఆవేశంతో, సుందర్రావు మీద కసితో తోట దులుపుకుపోయి తడాఖా చూపిద్దామని చిన్న దొంగతనానికి దిగినందుకే ఈ పరిస్థితి వచ్చిందిప్పుడు... అయినా ఇటువంటి పన్నెండ రికీ కలిసిరావు. చాల్చాలు... ఇటువంటి తప్పు లు ఇక ముందు చెయ్యగూడదు. కానీ డబ్బు?... ఏమో! ఎటూ తేల్చుకోలేకపోతోంది ఆమె.

ఏదైనా తన సుఖం కంటే కూతురి భవిష్యత్తు ముఖ్యం... తను అర్పితమైనా ఫర్వాలేదు. కూతు రి భవిష్యత్తు దివ్యంగా ఉండాలి... మరందుకు డబ్బు కంటే పరువు ముఖ్యం కాదా?... ఏ మో?... ఎన్నాళ్లిలా కష్టపడటం? వీడికి లొంగి పోతే?... కానీ వీడిలో కామమేగానీ కనికరం, ప్రేమ భూతద్దం పెట్టి వెతికినా కన్పడవు".

* * *

"మీరు కదలకపోతే నాల్గుపీకుతాను" రెచ్చి పోతున్నాడు సుందర్రావ్.

"ముసల్దాన్నుంచుకో. ఆమె బరువులు మో యలేదు. మేమిద్దరం వెళ్లి మీ ఇంట్లో దిగబెడ తాం ఈ మూటలు" విసిగిపోయి తుస్కారంగా అంది శకుంతల.

"ముసల్దా? కుదరదు, నువ్వేకావాలి"... వెకి లిగా నవ్వుతూ స్థిరంగా అన్నాడు సుందర్రావ్. అతని బుర్రలో లైటెలిగింది. "దీన్తల్లీ... ఏం తెలి వి? ముసల్దాన్ని ఇందుకు తెచ్చుకున్నదన్న మాట... రక్షణ... సాక్ష్యం కోసం?... అందానికి తోడు తెలివితేటలున్న ఆడదాని పొందు నాటు కోడి ఇగురుతో గారెల్ని లాగించినంత రంజుగా ఉంటుంది కదా!!!..."

ఇంక రెచ్చిపోయాడు సుందర్రావ్... 'ఫటా ఫటా తలా రెండూ తగిలించాడు ముగ్గురికీ... వెళ్లండి' హూంకరించాడు.

"తోట బయట పంచాయితీ పెట్టబట్టి ఇం కా ఇద్దరు ముగ్గురు చూసారు తమని. లేదంటే ముగ్గురం కలిసి వీడ్ని తుక్కుతుక్కుగా కొట్టేం దుము కదా?" ముసలమ్మ ఆలోచిస్తోంది. సుం దర్రావు చూపులు శకుంతలపైనే స్థిరంగా ఉ న్నాయి. అతనికి కాలం గడిచే కొద్దీ వెర్రెక్కి పోతుంది... మళ్లీ కర్రెత్తాడు. మూటలు భుజాని కెత్తుకొని, శకుంతల కేసి జాలిగా చూస్తూ

కదిలారు ముసలమ్మ, మరొకామె...

ఇంతలో కట్టమీద...

*   *   *

అడవిపంది కట్టెక్కింది... ముట్టెకిరువైపులా వంకెలు దిరుగుతూ బయటి కొచ్చిన దంతాలు మెరుస్తున్నాయి. కళ్లు చింత నిప్పుల్లా భగ్గుమంటున్నాయి, ముక్కులు బుసకొడ్తున్నాయి... (ఊర పందికి, అడవి పందికీ చాలా తేడా ఉంది. ఊరపంది వళ్లంతా రోమాలతో బాగా కొవ్వు పట్టి, పీపాలా ఉండి, మందంగా చరించే సాధు జీవి. అడవిపంది చెక్కిన శిల్పంలా, నున్నగా చిన్నసైజు బర్రెపడ్డలా నాజూగ్గా ఉండి, ఎనీ టైమ్ ఎటాక్ అన్నట్లు యమా చురుగ్గా ఉంటుంది). ఉచ్చపోసుకుంటూ పారిపోయిన గ్రామ సింహం మరో నాల్గు కుక్కల్ని వెంటేసుకొని ధైర్యంగా పందిని చుట్టుముట్టింది. వాటి స్థాన బలానికి బెదిరిన పంది కొట్లాడుకుంటున్న కోతుల మధ్యకు పరిగెత్తింది... రెచ్చిపోయి, కచ్చగా వెంటపడ్డాయి కోతులు... గీ, బా, బౌ, బౌ... గోలగోల...

ఇటు కోతులు, వెనక నుండి దూసుకొస్తున్న కుక్కలు... వరాహం బెదిరిపోయి ఎటాక్ చేసింది. అడ్డొచ్చిన కోతిని ఓ కుమ్ము కుమ్మి, రెండు ఊరకుక్కల్ని పల్టీ కొట్టించి కట్టమీద నుండి సపోటా తోటలోకి దూకింది... లోపల లుంగీపై కెగ్గట్టి, జబ్బుచ్చుకొని పంప్‌హౌస్ కేసి రావణుల్లా లాక్కుపోతున్నాడు శకుంతలని సుందర్రావ్. కుక్కల అరుపులు, కోతుల సందడి తలకెక్కలేదతనికి, అచ్చోసిన ఆంబోతు అతనిప్పుడు. శకుంతల విదిలించుకుంటోంది. ఆమె ఒక నిర్ణయాని కొచ్చేసింది... "ఇవాళ వీడ్ని చంపైనా పగతీర్చుకుంటానుగానీ లొంగేది మాత్రం లేదు..."

తోట్లోకి దూకిన పంది సరిగ్గా సుందర్రావు నడ్డిమీద ల్యాండ్ అయింది. లాగి పెట్టి తన్నిన బంతిలా 'వామ్మో' అంటూ తోట బయట పంట కాల్వలో పడ్డాడు. జీవితంలో మళ్లీ ఆడదాని జోలికి పోకుండా అతని వెన్నుపూసలిరిగిపోయాయి. అడవిపంది అనంత పద్మనాభస్వామి గుహలకేసి దూసుకుపోయింది. కోతులు తోటలో చెట్లెక్కి ఆగిపోయాయి. కుక్కలు ఇంకాస్త దూరం పందిని తరిమి, రొప్పుకుంటూ విజయగర్వంతో వెనుదిరిగాయి.

శకుంతల బిత్తరబోయి నిల్చుంది. "కాగల కార్యం గంధర్వులు తీర్చారన్నట్లు... తన చేతిలో చావాల్సిన దుర్మార్గుడ్ని, సింహాచల నృసింహ స్వామి తన అంశని పంపి శాస్తి చేశాడు!!!" ఆమె తన ఇష్టదైవాన్ని తలచుకొని దణ్ణాలు పెట్టుకుంటోంది...

*   *   *

మార్నింగ్ వాక్‌కి పడమట కెళ్లిన పురుషోత్తం తిరిగొస్తున్నాడు. అతను పందిని కుక్కలు, కోతులు వెంబడించడం... పంది సపోటాతోటలోకి దూకడం, సుందర్రావు ఎగిరొచ్చి బంతిలా బురదలో పడడం గమనించాడు. పక్క పొలాల్లోని రైతులను కలుపుకొని సుందర్రావునెత్తుకొని ఊళ్లోకి దారితీసారందరూ. శకుంతల వేరే దార్లో నుండి వేగంగా వెళ్లి, ఊళ్లోకెళ్తున్న తన స్నేహితురాళ్లని కలిసి విషయం చెప్పగా వాళ్లు రూటు మార్చి తమ ఇళ్లకెళ్లిపొయ్యారు. శకుంతల కాసేపాగి, సుందర్రావుని మోసుకెళ్లే గుంపుని వెంబడించింది... ఏదో పిచ్చి నమ్మకం ఆమెలో... ఇవ్వాళ రోజు బాగుంది... ఇంకేదో మంచి జరగబోతోంది...

*   *   *

ఆసరికే తెల్లగా తెల్లవారింది. బ్రాందీకొట్లో రాత్రి కలెక్షన్, ఇన్‌కమ్‌టాక్స్ కడ్దామని ఇంటి నుండి తెచ్చిన రొక్కం కలిపి లెక్కెడ్తున్న సుంద

గ్రావ్ మేనల్లుడు మామని సాటి రైతులు మోసు కురావడం చూసి... 'ఓరేయ్ పండూ, కొట్టుచూ సుకోరా, అని లోపల బార్‌ని శుభ్రం చేస్తున్న పన్నెండేళ్ల కుర్రాడ్ని కేకేసి, గల్లాపెట్టికి తాళం వేయకుండానే బయటికి పరిగెత్తాడు. హాస్పిటల్ ముందు జనం మూగారు. పండుగాడు కూడా కొట్టు బయటున్న కమ్యూనిష్టు జెండా దిమ్మెక్కి చోద్యం చూడసాగాడు. చాటునుండి శకుంతలొ చ్చి చిటుక్కున కొట్టులోపలకెళ్లొచ్చి చటుక్కున జనంలో కలిసిపోయింది.

* * *

సుందర్రావ్ ఆర్నెల్లపాటు హాస్పిటల్ పాల య్యాడు. డాక్టర్లు అతని బొక్కసంలో సగం ఖర్చు చేయించి, సంసారానికి పనికిరావని సర్టిఫికెట్ చేతిలో పెట్టారు. సంఘటన జరిగిన మర్నాటి నుండి శకుంతల ఉండవల్లిలో కన్పడలేదు. బ్రాందీషాప్ గల్లా పెట్టి నుండి అరవైవేలు క్యాష్ పోయింది. సుందర్రావ్ మేనల్లుడు సందట్లో సడేమియాలా దొంగపేర్న మరింత నొక్కేసాడు. షాపులో మళ్లీ మళ్లీ దొంగలుపడ్డారు???

సుందర్రావ్ హాస్పటల్ నుండి బయటపడే సరికి కొంపకొల్లేరయి, బ్రాందీషాప్ మూతబడిం ది. కళ్యాణి నూజివీడు ట్రిపుల్ ఐటిలో చేరింది. శకుంతల మళ్లీ దొంగతనాల జోలికి పోలేదు. అక్కడా ఇక్కడా పన్లు చేసుకుంటూ కూతుర్ని కనిపెట్టుకొని నూజివీడులోనే ఉంది. కళ్యాణి శ్రద్ధగా చదువుకుంటూ జీవితంలో ఒక్కో మెట్టూ పైకెక్కుతోంది.

* * *

అదే సారా కొట్టు తన మొగుడ్ని బలితీసు కుంది. అదే బ్రాందీ కొట్లోని గల్లాపెట్టి తన కూతుర్ని చదివిస్తోంది. కొట్టు మూతబడటానికి జరిగిన సంఘటన పరంపరకి ట్రిగ్గర్‌నొక్కింది

ఒక స్థిరమైన జీవితాశయం లేనివ్యక్తి గడియారంలోని 'పెండ్యులమ్' వంటివాడు. అటూ ఇటూ ఊగడమే తప్ప అతనికి ముందుకెళ్లే అవకాశమే ఉండదు.

* * *

చరిత్ర చదవడం సులభమే చరిత్ర సృష్టించడమే కష్టం. ఇతరులు చదువుకునే టంతటి చరిత్రను సృష్టించడానికి ప్రయ త్నించు.

కూడా శకుంతలే. అయినా బ్రాందీకొట్టు మూతబడితే ఎవడికి నష్టం?

ఉదయపునడకలో సపోటాతోట దగ్గరకొచ్చి నప్పుడల్లా ధర్మాధర్మ విచారణ మొదలవుతుంది పురుషోత్తం బుర్రలో... శకుంతలారోజు కొట్లో కి వెళ్లడం అతను స్పష్టంగా చూసాడు... ఎవరికీ చెప్పలేదు... ఇదో పెద్ద కాంట్రాడిక్టరీ ప్రపం చం... లోపలొకటి, బయటొకటి... గవర్నమెం ట్ జనహితమైన ప్రాజెక్టులు కడతాం అంటూ ఇబ్బడిముబ్బడిగా మందమ్మి టాక్సులు గుంజు తోంది... ఏలేవాళ్ల దృష్టిలో తాగుబోతోళ్ల జీవి తాలు, ప్రాణాలు ఎక్స్‌పెండబుల్... హిట్లర్‌కి యూదులు, అమెరికన్లకి తామంటగట్టే ఆయు ధాలు నెత్తినేసుకునే దేశాలన్నీనూ... ప్రతి చర్య వెనకో సమర్థింపు... కోట్లమంది బలి... ఇటు వంటి సామాజిక న్యాయంలో శకుంతల కూతు రి చదువు కోసం బ్రాందీషాపు ఎక్స్‌పెండబుల్ అవ్వడంలో తప్పేంటి? అయినా ఈ లాజిక్ ఎవడికి కావాలి?... Every dog has its day... ఏం చెప్పాడు SunTzu... 'ఓటమి నుండి రక్షించుకోవడం మన చేతుల్లో ఉంటుం ది. కాని శత్రువుని ఓడించే అవకాశం మాత్రం శత్రువు తనంతట తానే మనకిస్తాడు' భలే... బిగ్గరగా నవ్వాడు పురుషోత్తం. ●